## క్లుప్తంగా

### ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



అంకాలగూడెంలో అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

కొయ్యలగూడెం: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి కొయ్యలగూడెం మండల రోటరీ క్లబ్ శుక్రవారం ఆర్థిక సహాయం అందజేసింది. అంకాలగూడెం గ్రామంలో 13న సంభవించిన అగ్ని ప్రమాదం వలన సొంగా శేఖర్‌బాబు గృహం అగ్నికి ఆహుతి అయింది. విషయం తెలుసుకున్న సభ్యులు క్లబ్ అధ్యక్షుడు విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో బాధితుడికి రూ.5వేల నగదు అందజేశారు. ప్రభుత్వం తరఫున రెవెన్యూ శాఖ ద్వారా నిత్యవసర సరుకులను రెండు బాధిత కుటుంబాలకు అందజేశామని మణి దివ్య తెలిపారు. అమీర్ బాషా, తోట వెంకటేశ్వరరావు, సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, పాదం రాము, గోలిశెట్టి శ్రీనివాసరావు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, మద్దు గోపి, మజ్జి సూరిబాబు, తేజ భరద్వాజ్ పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఏర్పాటు



మసీదు కమిటీ సదర్‌గా ఎంపికైన షేక్ జహీర్‌తో కార్యవర్గ సభ్యులు

వేలేరుపాడు: స్థానిక జామా మసీద్ నూతన కమిటీ శుక్రవారం ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడు(సదర్)గా షేక్ జహీర్, ఉపాధ్యక్షుడు(నాయబ్ సదర్)గా ఎండీ జాఫర్‌ఖాన్, కార్యదర్శిగా షేక్ ఖాజా మొహిద్దీన్‌ను జమాత్ నియమించింది. అలాగే జాయింట్ సెక్రటరీగా షేక్ జాకీర్, సభ్యులుగా ఎండీ సమీర్ ఖాన్, ఎండీ మోసిన్, గౌరవ అధ్యక్షులుగా ఎండీ యాకూబ్ ఖాన్, ఎస్‌కే నసీరుద్దీన్, తదితరులు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు పాల్గొన్నారు.

### శ్రీవారి సేవలో ఏలూరు ఎంపీ పుట్టా



ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్‌కు స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న ఈవో త్రినాథరావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చిన వెంకన్న ఆలయాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

### పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఉంగుటూరు: పరిసరాల పరిశుభ్రతతో ప్రజలకు ఆరోగ్యం కలుగుతుందని చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టరు డా.శ్రావణ రెడ్డి తెలిపారు. శుక్రవారం చేబ్రోలు పీహెచ్‌సీలో మలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రావణ రెడ్డి మాట్లాడుతూ చలి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, పర్యవేక్షకులు అప్రమత్తంగా పని చేయాలన్నారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ నెలంతా మలేరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సామాజిక ఆరోగ్య అధికారి రత్నరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

### నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

దెందులూరు: గోపన్నపాలెం సాయిబాబా ఆలయ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ గోపి తెలిపారు. ఉదయం సాయిబాబా ఆలయంలో పూజలు అనంతరం భక్తుల సహకారంతో ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహిస్తామని భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

### మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి : తన భార్య పిల్లలు రెండు రోజులుగా కనిపించడం లేదని ఓ భర్త పోలీసులను ఆశ్రయించాడు. పెదవేగి ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయికి చెందిన పూల నాగమనోహర్ భార్య, ఇద్దరు పిల్లలు ఈనెల 12న మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని, చుట్టు పక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

# మొదలైన చదువుల సందడి

- బడి వైపు విద్యార్థుల అడుగులు
- కళకళలాడిన పాఠశాలలు



పాఠశాలలు ప్రారంభం కావడంతో స్కూల్‌లో ప్రేయర్ చేస్తున్న విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో గిరి భగవాన్ దాస్

బుట్టాయగూడెం: దాదాపు 49 రోజుల తర్వాత పాఠశాలలు కళకలలాడుతున్నాయి. వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు చదువుల తల్లి ఒడివైపు వడివడిగా అడుగులు వేశారు. అయితే ఎలిమెంటరీ స్థాయి విద్యార్థులు వేసవి సెలవుల్లో స్నేహితులతో కలిసి ఆడుకోవడం, బంధువుల ఇళ్లకు వెళ్లి సందడి సందడిగా గడిపి ఒక్కసారిగా పాఠశాలలకు వెళ్లేందుకు కొందరు మొరాయించడం కనిపించింది. మొదటిరోజు కంటే రెండో రోజు అధిక సంఖ్యలో విద్యార్థులను తల్లిదండ్రులు బుజ్జగిస్తూ పాఠశాలకు తీసుకెళ్లడం కనిపించింది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా సెలవుల్లో విద్యార్థులు ఎలా గడిపారు, ఎక్కడికి వెళ్లారని ఉపాధ్యాయులు అడిగి తెలుసుకున్నారు. అలాగే తొమ్మిదో తరగతి నుంచి పదో తరగతికి వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు కాస్త హితబోధ చేశారు. సమయాన్ని వృథా చెయ్యకుండా చదివితే అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కాగలరని చెప్పారు. విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధమయ్యేందుకు ప్రణాళికలను వివరించారు. పాఠశాల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చెయ్యడంతో పాఠ్యాంశ బోధనను కూడా ఉపాధ్యాయులు ప్రారంభించారు.

**స్నేహితుల మోముల్లో తొణికిసలాడిన సంతోషం**

సుమారు 49 రోజుల తర్వాత పాఠశాలలు ప్రారంభం కావడంతో కలుసుకున్న స్నేహితులు అనేక మందిలో తమ స్నేహితులను కలుసుకున్నామన్న ఆనందం కనిపించింది. చాలా రోజుల తర్వాత పాఠశాల ఒడిలో స్నేహితులు కలవడంతో వారిలో ఆనందం తొణికిసలాడింది. పాఠశాల పునఃప్రారంభం కావడంతో అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు స్వయంగా తీసుకొచ్చి వదిలి వెళ్లారు.

**నేను బడికి పోతా కార్యక్రమం**

కుక్కునూరు: నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి గిరి భగవాన్ దాస్ కోరారు. నూతన విద్యా సంవత్సర ప్రారంభం సందర్భంగా శుక్రవారం ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేనుబడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందించే విద్యా కిట్‌ను అందేలా చేయాలన్నారు.కిట్‌లను ప్రస్తుత ప్రజాప్రతినిధులతో పంపిణీ చేయించాలన్నారు.మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చూడాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు.

### మంచి ఫలితాల సాధనకు కృషి



ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే కృషి చేస్తాం. అన్ని తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. తరచూ పాఠశాలను తనిఖీ చెయ్యడంతోపాటు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తాం. **తెల్లం బాబూరావు, ఎంఈవో– బుట్టాయగూడెం**

### రేపటి నుంచి కల్యాణోత్సవాలు



కొయ్యలగూడెం పురాతన ఆలయంలో కొలువైన స్వయంభు విగ్రహం

కొయ్యలగూడెం: రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి ఆలయంలో శనివారం నుంచి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపి పేర్కొన్నారు. మదన గోపాలస్వామి ఆలయంలో (ఉపాలయం) శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి ద్వితీయ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొల్లూరు శ్రీనివాస్, పావని దంపతుల చేతుల మీదుగా ఉదయం 7 గంటలకు ఉత్సవమూర్తుల విగ్రహాలకు వధూవరుల అలంకరణ నిర్వహిస్తున్నామని తెలిపారు. కేరళ వాయిద్యాలతో ప్రత్యేక సంబరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 16న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం తిరుప్పావై సేవ, అన్న సమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కల్యాణ కార్యక్రమాలు కామవరపుకోట వాస్తవ్యులు శ్రీ లక్ష్మీ హయగ్రీవ లలిత శ్రీ పీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ శ్రీసుదర్శన రామదుర్గ కుమారాచార్యులు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

# చిన్నారులకు బాసటగా అంగన్‌వాడీ



అంగన్‌వాడీ చిన్నారులకు ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ నిర్వహిస్తున్న దృశ్యం



అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఐసీడీఎస్ పీవో స్వర్ణకుమారి

కొయ్యలగూడెం: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు బాసటగా నిలుస్తూ ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో సృజనాత్మక శక్తి పెంపొందిస్తాయని ఐసీడీఎస్ పీవో యూఎన్ స్వర్ణకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కొయ్యలగూడెం సెక్టార్ పరిధిలోని పరింపూడి పంచాయతీలో సూపర్‌వైజర్ ఏ.నయోమీరాణి ఆధ్వర్యంలో చిన్నారులకు ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం తల్లులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థులు అంగన్‌వాడీ చదువును పూర్తి చేసుకొని ప్రాథమిక విద్యకు వెళుతున్న సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. వారికి శుభాకాంక్షలు తెలుపుతూ గ్రాడ్యుయేషన్ దుస్తుల వేషధారణతో వీడ్కోలు తెలిపారు. చిన్నారుల తల్లులతో కలిసి భాషాభివృద్ధి, శారీరక మానసిక అభివృద్ధి గురించి బిడ్డలు తమ తల్లులకు బోధించాల్సిన అంశాల గురించి అవగాహన కల్పించి ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ పిలుస్తోంది**

కామవరపుకోట: జంగారెడ్డిగూడెం ప్రాజెక్ట్ అంగన్‌వాడీ సీడీపీవో బ్యూల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో కామవరపుకోట–1 అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో బ్యూల మాట్లాడుతూ పిల్లల మానసికోల్లాసానికి వారి శారీరక అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు తోడ్పడతాయన్నారు. 3 సంవత్సరాలు దాటిన పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఆమె తెలిపారు. పిల్లల కోసం అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కామవరపుకోట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంగాదేవి, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలలకు పుస్తకాల సరఫరా



శింగగూడెం జెడ్పీపీ హైస్కూల్‌లో స్టాక్ పాయింట్ నుంచి పాఠ్య పుస్తకాలు తరలిస్తున్న దృశ్యం

లింగపాలెం: మండలంలోని 60 పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి కే.రామారావు తెలిపారు. మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు, 50 ప్రాథమిక పాఠశాలలకు 20,257 పాఠ్య పుస్తకాలు, 20,256 నోట్ పుస్తకాలు, బెల్టులు 2,569 వచ్చినట్లు ఎంఈవో తెలిపారు. వీటన్నింటిని ఆయా పాఠశాలలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 3,956 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. శింగగూడెం జెడ్పీపీ హైస్కూల్‌లో స్టాక్ పాయింట్ నుంచి పాఠ్య పుస్తకాలను పాఠశాలకు ఉపాధ్యాయుల ద్వారా తరలిస్తున్నట్లు తెలిపారు. త్వరలో విద్యార్థులకు పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు. డ్రాఫ్ అవుట్స్ లేకుండా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేయాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల పని తీరుపై శ్రద్ధ చూపాలని వీటి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రామారావు కోరారు. కార్యక్రమంలో ఎంఈవో–2 జే.రవీంద్ర, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు జీ.కుమార్ మంగళం, టీ.కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటం

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న మన్నవ కృష్ణ చైతన్య

జంగారెడ్డిగూడెం: గ్రామీణ ప్రాంతాలలో ప్రజా సమస్యలను వెలికి తీసి వాటి పరిష్కారానికి సీపీఐ శ్రేణులు ఉద్యమించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ పట్టణ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం పెదసఖనగంటి బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ నూతన ప్రభుత్వం జిల్లా అభివృద్ధి కోసం జరిగే ప్రతి చర్యకు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పోరాటం మాత్రం ఆగబోదని, ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని నిలదీస్తుందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే, అలుపెరుగని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జెవి.రమణ రాజు, మండల సహాయ కార్యదర్శి కుంచె వసంత రావు, మండల కౌన్సిల్ సభ్యులు గొలిమె బాల యేసు, తాళ్లూరి నాగరాజు, చిలంత రాజుల శ్రీను, కలపాల శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవం



కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో గణపతి పూజ నిర్వహిస్తున్న అర్చకులు



అమ్మవారి చిత్రానికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: చిన వెంకన్న ఆలయానికి ఉపాలయమయ్యి, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు నిర్వహించే వేడుకల్లో భాగంగా తొలిరోజు గణపతి పూజ, పుణ్యహావాచనం, రుత్విగ్వరణ, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, అంకురార్పణను ఆలయ అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# నూకాలమ్మకు వెండి విరాళాలు



నూకాలమ్మ రజత వస్త్రానికి వెండిని సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ శుక్రవారం విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కల్యాణ కళా వేదిక వద్ద ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీ జలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. అర్చకులు మూల విరాట్‌కు ఏకాదశ హారతి, వేద దర్బారు సేవ, చతుర్వేద స్వస్తి , నీరాజన మంత్ర పుష్పం, సాయం సంధ్యా హారతి నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మ వారి వెండి చీర తయారీకి అమెరికా వాస్తవ్యులు కంభంపాటి ఫణి కుమార్, భాగ్యలక్ష్మి దంపతులు రూ.10,116 విలువ గల వెండి, బెంగళూర్ వాస్తవ్యులు అత్యం జానకి నరసింహరావు, మానస దంపతులు (కర్ణాటక) రూ.5,116 విలువ గల వెండి, తమ్మన పవన్ కృష్ణ, సుజాత దంపతులు (రాజమండ్రి) 5 తులాల వెండిని విరాళాలుగా అందజేశారని తెలిపారు. ఈ నెల 19న శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి 64వ చండీ హోమం నిర్వహిస్తామన్నారు. హోమంలో పాల్గొనే భక్తులు ఆలయ కమిటీని సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జగనన్న పాలనలో దళితులకు మేలు

దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాంబాబు



తాటాకులగూడెంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే దళితులకు మేలు జరిగిందని దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తగరం రాంబాబు అన్నారు. సాధారణ ఎన్నికల సందర్భంగా జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎన్నికల కోడ్ నేపథ్యంలో వేసిన ముసుగు సోమవారం రాంబాబు ఆధ్వర్యంలో తొలగించి, శుభ్రం చేశారు. అలాగే మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దళితులు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని జగనన్నకు అండగా నిలిచారన్నారు. గెలుపోటములు సహజమని, గుండెనిబ్బరంతో తామంతా వైఎస్ జగన్‌తోనే ఉంటామని వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎం చేసే వరకూ తమ వంతు కృషి చేస్తామన్నారు.కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు గంధం బోస్, దళిత సంక్షేమ సంఘం సోషల్ మీడియా కోఆర్డినేటర్ కంటే కేశవరావు, నాయకులు గిద్దా శ్రీను, సంతోష్, కూరకుల రమేష్, రాయి శ్రీను, సతీష్, ఆర్. వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి విత్తనాలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ పీజీ బుచ్చిబాబు, మండల వ్యవసాయాధికారి కె.గంగాధర్, జీలుగుమిల్లి సొసైటీ సెక్రటరీ పసుపులేటి కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

# డివైడర్‌ను ఢీకొన్న కారు

తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో ధ్వంసమైన కారు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన ఘాట్ రోడ్డులో ఒక భక్తుడి కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం జంగారెడ్డిగూడెం భక్తుడు కుటుంబ సభ్యులతో ఫోటో షూట్ నిమిత్తం కారులో క్షేత్రానికి విచ్చేశాడు. కొండపైన ధర్మ అప్పారాయ నిలయం వెనుక రోడ్డులో ఫొటో షూట్ నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా కారు వెనుక చక్రం పేలి, అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. కారులో బెలూన్స్ ఓపెన్ అవడంతో సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

### వేతన బకాయిలు విడుదల చేయాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ సభ్యుడు చంటి

కామవరపుకోట: ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇచ్చి, వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.చంటి, అందుగులు ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రామన్నపాలెం, ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపాలెం, ఉప్పలపాడు ఉపాధి కూలీలకు ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రోజువారీ వేతన కూలి పే స్లిప్పులు ఇవ్వలేదని, తక్షణమే కూలీలకు స్లిప్పులు అందజేయాలన్నారు. మూడు నెలల నుంచి కూలీలు పని చేస్తున్నప్పటికీ వేతన బకాయిలు లక్షల రూపాయలు ఉన్నాయని వేతనాలు రాక కూలీలు ఆకలితో అలమటిస్తున్నారని పలుమార్లు అధికారులను వేతనాలు విడుదల చేయాలని దరఖాస్తులు పెట్టినప్పటికీ కూలీలపై చిన్న చూపు చూస్తూ నిమ్మకు నీరుగారినట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టంలో 15 రోజులకోసారి వేతన బకాయిలు, జాబు కార్డులు, పేస్లిప్పులు కూలీలకు ఇవ్వాలని చట్టం ఉన్నప్పటికీ ఎందుకు అమలు చేయటం లేదని అధికారులను ప్రశ్నించారు.